

ఓం సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయ నమః

# శ్రీ సాయి లీలామృతము

## అధ్యాయము - 11



## ఆశ్రిత కల్పవృక్షము

భగవంతుడు సర్వ జీవులనూ సృష్టించి సర్వులకూ తండ్రి అయ్యాడు. తానే పంచభూతాలై తన నుండే జీవులందరికీ దేహాలు, పోషణ యిచ్చి తల్లి అయ్యాడు. వేదాలు మొదలుకొని సర్వ శాస్త్రాలూ అనుగ్రహించి ఆప్తవాక్యం చెప్పే మిత్రుడయ్యాడు. సకల సృష్టినీ తన అధీనంలో వుంచుకొనడం వలన జీవులకు ఈశ్వరుడయ్యాడు. మహనీయుల రూపంలో అవతరించి గురువయ్యాడు. ఒక్కమాటలో చెప్పాలంటే యిన్ని రీతుల సర్వజీవుల శ్రేయస్సుకోసం తనను తానే వారికి దత్తం - అంకితం - అయ్యాడు. భూమిమీద ఆయన ప్రతిరూపమైన సద్గురువు రూపంలో ఆయన అవతరించినప్పుడు తననాశ్రయించిన వారందరికీ కల్పవృక్షము, కామధేనువు, చింతామణీ అవుతాడు. అదే శ్రీసాయి చరిత్ర అంతా. అందుకే ఆయన చరిత్రను "శ్రీసాయి లీలామృతము" అనడం సమంజసం.

కేవలం మాటమాత్రంతో బాబా యెందరికో బాధలు తీర్చారు. ఒకరోజు శ్యామా ఆయన చేతులు తుడుస్తుంటే ప్రేమగా ఆయన అతని బుగ్గ గిల్లారు. అతడు కోపం నటిస్తే, "72 జన్మలనుండి రక్షిస్తున్నా, నిన్ను ఎన్నడూ గిల్లనైనాలేదు. ఇప్పుడు తాకీతాకకముందే కోపగించుకుంటావెందుకు?" అన్నారు. "ఇలా గిల్లేదేవుడు మాకొద్దు. ప్రేమతో ముద్దులు, మిఠాయిలు పెట్టే దేవుడే కావాలి. అటువంటి మీపై నాకు పూర్ణవిశ్వాసం వుండేలా అనుగ్రహించండి" అన్నాడు శ్యామా. సాయి, "నేనందుకే వచ్చాను" అని ఆశీర్వదించారు. కాని ఇతనికొకసారి పాము కరచి త్వరగా విషమెక్కుతున్నది. అతని స్నేహితులు విరోబా ఆలయానికి పోదామన్నా అతడు మశీదుకే వచ్చి మెట్లెక్కుతున్నాడు. బాబా ఉగ్రులై, "ఓరీ దొంగపూజారీ! పైకెక్కవద్దు ! దిగు! ఫో బయటికి! పైకెక్కావో జాగ్రత్త!" అని గద్దించారు. శ్యామా నివ్వెరబోయాడు. ఆయన మరుక్షణమే ఎంతో ప్రేమగా, "భయంలేదు, యీ ఫకీరు నిన్ను తప్పక కాపాడుతాడు" అన్నారు. తక్షణమే శ్యామాకు బాధంతా తగ్గిపోయింది. అంతకుముందు ఆయన కసిరినది అతని రక్తంలో కలసిపోయి పైకెక్కుతున్న విషాన్నే! శ్రీమతి మాలంబాయికి క్షయరోగం వచ్చింది. ఏ చికిత్సా ఉపకరించకపోయేసరికి ఆమె శిరిడీ వచ్చింది. బాబా ఆమెను ఆశీర్వదించి, కేవలం దుప్పటిమీద మాత్రమే పడుకోమని, నీరు మాత్రమే త్రాగమనీ చెప్పారు! వారం రోజులలో ఆమె మరణించింది. నాడు ఉదయం 8 గం॥లైనా బాబా చావడిలోనే వుండిపోయారు. దహనానికి యేర్పాట్లు జరుగుతుండగా ఆమెకు తిరిగి ప్రాణమొచ్చింది! ఆమె, 'నన్నెవరో నల్లటిమనిషి ఎత్తుకుపోతుంటే నాకేక విని సాయివచ్చి నన్ను విడిపించుకొచ్చారు' అని చెప్పింది. అంతవరకూ ఆమె చావడిని చూడనేలేదు. అయినా దానిని చక్కగా వర్ణించి చెప్పింది. సరిగా ఆమె లేచే సమయానికి సాయి ఆవేశంతో తిడుతూ, సట్కాతో బెదిరిస్తూ ఎందుకు బయటకొచ్చారో అప్పుడందరికీ అర్థమయింది.

డా॥ పిళ్ళేకు నారికురుపు లేచింది. అతడు ఆ బాధ భరించలేక దానిని 10 జన్మలలో అనుభవించేలా చేయమని బాబాకు చెప్పించాడు. సాయి, "పది జన్మలెందుకు, పదిరోజులు చాలు" అని చెప్పి అతనిని రప్పించి, తమ దిండుకు అనుకోమని చెప్పి, "సర్వకర్తయైన దైవాన్నే శరణు పొంది ఓరిమితో కర్మఫలమనుభవించు, ఆయనెలా

చక్కబెడతారో చూడు!" అన్నారు. మరురోజు, 'ఇప్పుడొక కాకి వచ్చి ఈ కురుపును పొడవగానే బాధ తగ్గిపోతుంది' అన్నారు. ఇంతలో ప్రక్కనే పనిచేస్తున్న అబ్దుల్లా పొరపాటున పిళ్ళేకాలు త్రొక్కాడు. అది పగిలి పురుగులన్నీ బయటకొచ్చేసాయి. తర్వాత అతడు, "కాకి వచ్చేదెప్పుడు?" అంటే, "ఆ కాకివచ్చి కురుపును పొడిచేసింది!" అన్నారు బాబా. కొద్ది రోజులలో ఆ కురుపు మానిపోయింది. ఎందుకోగాని అబ్దుల్లాను "కాకి" అనేవారు బాబా. ఒకసారి శిరిడీలో ప్లేగు చెలరేగి, అందరూ ఊరు విడిచి పోతున్నారు. నందరామ్ మార్వాడీకి గూడ కళ్ళు ఎర్రబడ్డాయి. అతడు భయంతో ఊరువిడిచి పోవడానికి అనుమతి కోరితే సాయి, "నీవు పారిపోనక్కరలేదు. నేనున్నంతవరకూ నీకెట్టి ప్రమాదమూ వుండదు" అన్నారు. అప్పుడే అతడికి జ్వరం తగ్గిపోయింది. అలానే 1911లో ఒక వైశ్యుడు తన కుమార్తెను మోసుకొచ్చాడు. ఆమె కాళ్ళు చచ్చుబడిపోయాయి. సాయి ఆమెనాశీర్వదించి కొద్ది రోజులు శిరిడీలో వుండమన్నారు. మూడవ రోజుకల్లా ఆమె లేచి నడవసాగింది. అలానే ఆయన గయాసిస్, అనే రైల్వే ఉద్యోగి భార్యకు పక్షవాతం తగ్గించారు. పర్భనీనుంచి ఒకడు వచ్చి తనపై మంత్రప్రయోగం జరిగిందని, దానివలన అన్నం వెంట్రుకల్లా కన్పించి కంపుకొడుతున్నదని, తననెవరూ రక్షించలేకపోయారనీ చెప్పుకున్నాడు. బాబా, "అల్లా అచ్చా కరేగా!" అని ఆశీర్వదించారు. అంతటితో ఆ బాధ తొలగింది. ఒకరోజు ఒక నిరుపేదరాలు నమస్కరించగానే బాబా, "అమ్మా, నీ యింటికొస్తున్నాను, నిరాకరించవద్దని నీ భర్తతో చెప్పు!" అన్నారు. ఆమెకేమీ అర్థం కాలేదు. సరిగా అప్పుడే వాడాలో వున్న దీక్షిత్‌కు, ఆ కుటుంబానికి సహాయం చేయాలని పించింది. అతడు ఒక కవరులో పైకముంచి, మశీదుచేరి, "బాబా యిది పంపనా?' అన్నాడు. "ఎవరికి, ఏమిటి?" అనైనా అడగకుండా సాయి 'పంపించు' అన్నారు. ఆ పైకం చూడగానే ఆ పేదరాలికి సాయి మాటలు అర్థమయ్యాయి. కోరకనే లభించిన సహాయం భగవత్ప్రసాదమని సాయి భావం. ఒకరోజు నిరుపేదయైన కార్నిక్‌ను చూచి సాయి నవ్వుతూ, "ఆవో షాహుకార్!" అన్నారు. కొద్ది సం॥లలోనే అతడు కోటీశ్వరుడయ్యాడు.

భీమాజీపాటిల్ (నారాయణ్ గా॥వ్)కు క్షయరోగమొచ్చి తరచూ నెత్తురు కక్కుతున్నాడు. వైద్యులు అతడు బ్రతకడని చెప్పేసారు. నానాసాహెబ్ సలహాపై అతడు శిరిడీ దర్శించాడు. శ్రీ సాయి మొదట, అతడికి ఆ వ్యాధి పూర్వ పాపం వల్ల వచ్చిందని, తాము నివారించమనీ చెప్పేసారు! కాని అతడు కన్నీటితో శరణువేడితే కరిగిపోయి, "భయపడకు, యీ మశీదులో కాలుపెట్టగానే ఎంత కష్టమైన తీరవలసిందే! ఇక్కడి ఫకీరు దయామయుడు" అన్నారు. సాయిని దర్శించిన క్షణంనుండి అతనికి నెత్తురు కక్కడం ఆగిపోయి అతని పరిస్థితి మెరుగు కాజొచ్చింది. బాబా అతడిని భీమాబాయి యింటివద్ద వుంచారు. నిజానికి ఆ యిల్లు అటువంటి రోగికి యేమాత్రమూ తగదు. కొద్ది రోజులకు అతడికి రెండు కలలు వచ్చాయి. మొదటి కలలో పద్యాలు వల్లించనందుకు భీమాజీని టీచర్ కొట్టాడు. రెండవ కలలో, అతడి గుండెలమీద ఎవరోగాని పెద్ద రోలర్‌ను అటూ యిటూ దొర్లిస్తున్నారు. అతనికి భరించలేనంత బాధకల్గింది. మెలకువ వచ్చేసరికి అతని వ్యాధి పూర్తిగా తగ్గిపోయింది! అందుకు కృతజ్ఞతగా అతడు శ్రీ సాయిసత్యవ్రతం చేసుకోసాగాడు.

గ్రహబలంగూడ గురుని అనుగ్రహ బలానికి లోకువే! ఒక జ్యోతిష్కుడు ఒకరోజు బూటీకి గండమున్నదని చెప్పాడు. బూటీతో సాయి, "ఏమిటీ, నీకు గండమున్నదా? అదేమి చేస్తుందో నేను చూస్తాను" అన్నారు. నాడు చీకటిపడ్డాక బూటీ బయటకు వెళ్ళినప్పుడు ఒక పెద్ద పాము ఎదురైందిగాని ఏమీ చేయలేదు. ఒకసారి మేరీకర్‌తో గూడ సాయి, "నీకు ద్వారకామాయి తెలుసా? ఇప్పుడు నీవు కూర్చున్నది అదే, ఈ మశీదు తల్లిని ఆశ్రయిస్తే కష్టాలు తొలుగుతాయి" అన్నారు. అప్పుడు తన చేయి పాములా పెట్టి, "ఆ పెద్ద మనిషి భయంకరుడే గాని, ద్వారకామాయి బిడ్డలను అతడేమీ చేయలేడు. అతణ్ణి మనం వినోదంగా చూడగలం!" అన్నారు. అతడు ఆ మరుసటి రాత్రి చితలీ చేరి, మారుతి ఆలయంలో బసచేశాడు. అక్కడ అతడి ఉత్తరీయంమీద పెద్దపాము పడు

కుంది గాని, ఏమీ చేయలేదు. సాయి మనలను యే రూపంలోనైనా రక్షించవచ్చు.

టెండూల్కర్ అనే భక్తుని కుమారునికి జాతకంలో గ్రహాలు, దశ బాగాలేవని, కనుక అతడు పరీక్షలో కృతార్థుడు కాజాలడనీ జ్యోతిష్కులందరూ చెప్పారు. అంతటితో ఆ యువకుడు భయపడి, ఆ సంవత్సరం పరీక్షకే వెళ్ళనని పట్టుబట్టాడు. అతని తల్లి ఆ విషయం బాబాతో చెప్పుకున్నది. బాబా, "నన్ను నమ్ముకోమని మీ వాడికి చెప్పు. ఆ జాతకాలు, జ్యోతిష్కులు చెప్పిన ఫలితాలూ అవతల పారేసి, బుద్ధిగా చదువుకోమను. ధైర్యంగా పరీక్షకు వెళ్ళమను. తప్పక పాసవుతాడు" అన్నారు. అతడలాగే చేసి పరీక్ష పాసయ్యాడు. అలానే దామోదర్ రాస్నేకు చాలాకాలం సంతానం కలుగలేదు. జ్యోతిష్కులందరూ అతనికి సంతాన ప్రాప్తిలేదని చెప్పారు. కాని సాయి అనుగ్రహంతో అతనికి బిడ్డలు కలిగిన లీల క్రిందటి అధ్యాయాలలో చూడవచ్చు.

ఒకసారి మార్తాండ్ అనే దర్జీవానికి జబ్బు చేసింది. అతడితో సాయి, "నీవు నీమ్‌గాఁవ్‌లోని డేంగ్లే వద్దకు వెళ్ళు, ఆదరిస్తాడు" అన్నారు. అతడు నీమ్‌గాఁవ్ చేరగానే, డేంగ్లే, "బాబా నాకు కలలో కన్పించి, నిన్ను నా వద్దకు పంపుతున్నానని చెప్పారు. ఇది నీ యిల్లనుకొని కావలసినని నిస్సంకోచంగా అడుగు!" అన్నాడు. మార్తాండ్ త్వరలో కోలుకున్నాడు.

ఒకరోజు యశ్వంత్‌దేశ్‌పాండే అనే భక్తుని తండ్రి సాయిని దర్శించి, తనకు కళ్ళు కనిపించడంలేదని చెప్పాడు. దైవం మేలుచేస్తాడని ఆయన ఆశీర్వదించగానే అతడికి దృష్టివచ్చింది. మరొక అంధుడు తనకు వారి దర్శనభాగ్యం కలుగలేదని బాధపడ్డాడు. తక్షణమే అతడికి దృష్టివచ్చి, సాయిని తృప్తిగా చూచాక మరలా పోయింది! సం॥ 1912లో బలరామ్ దురంధర్ సోదరులు సాయిని దర్శించారు. వారితో సాయి, "మనం 60 జన్మలనుండి సన్నిహితులం" అని, చిలిం పీల్చి బలరామ్‌కిచ్చారు. అభ్యాసంలేని అతడు ఎంతో కష్టంమీద పొగ పీల్చాడు. ఆరు సంవత్సరాలుగా అతనిని బాధిస్తున్న ఉబ్బసం నాటితో అంతరించింది.

ఒకరోజు బాపూసాహెబ్‌జోగ్ తన తండ్రి శ్రాద్ధానికి తన శాఖ బ్రాహ్మణులను తీసుకురావడానికి బయలుదేరాడు. కాని బ్రాహ్మణులు వారికై వారే వస్తారని బాబా చెప్పారు. సరిగా ఆ రోజుకు పుంతంబా నుండి యిద్దరు బ్రాహ్మణులు సాయివద్దకొచ్చారు. ఆయన వారిని జోగ్‌వద్దకు పంపారు. వారిద్దరూ గొప్ప పండితులేగాక, జోగ్ శాఖవారే!

ఒకరోజు ఠాణేనుండి ఒక పెద్దమనిషి వచ్చి తన కుమారుడు కొన్ని సం॥లుగా కన్పించలేదని సాయితో మొరపెట్టుకున్నాడు. బాబా అన్నారు: "తప్పక త్వరలో నీ బిడ్డను కలుసుకుంటావు." కాని అతనికి వెంటనే సెలవివ్వక రెండు రోజులు శిరిడీలోనే వుంచేశారు. మూడవరోజు అతడు మన్మాడునుండి బొంబాయి వెళ్ళే రైలులో ఠాణే చేరాడు. అప్పుడే బొంబాయి నుండి రైలొచ్చింది. అందులోంచి అతని కుమారుడు దిగాడు. తండ్రీకొడుకు లిద్దరూ ప్లాట్‌ఫారంమీద కలుసుకున్నారు! ఎప్పుడేమి చేయాలో మనకంటే ఎక్కువ బాబాకే బాగా తెలుసునని గుర్తుంచుకోవాలి. అదే సబూరీ!

మండు వేసవిలో ఒక మధ్యాహ్నం ఒక మేకపిల్ల ఎండకు తట్టుకోలేక క్రిందపడింది. సాయి దాని చుట్టూరా తిరిగి దానిపై నీళ్ళు చల్లారు. వెంటనే లేచి అది గంతులు వేస్తూ వెళ్ళిపోయింది. కేవలం సాయి సన్నిధే జీవులకు స్వస్థత చేకూర్చగలదు. సం॥ 1917లో ఒక పిచ్చికుక్క గ్రామంలోని యితర కుక్కలను తరిమి కరుస్తున్నది. గ్రామస్థులు దానిని చంపాలని తరుముతుంటే అది వచ్చి మశీదులో సాయివెనుక చేరింది. వాళ్ళు దానిని బయటకు తరమమని కోరితే; సాయి వారిని తిట్టి వెళ్ళగొట్టారు. ఆ తర్వాత ఆ కుక్కకు గాని, దానివలన మరే ప్రాణికిగాని యెలాంటి బాధా కలుగలేదు.

వారి సన్నిధి పతితులలో నైతిక పరివర్తన కలిగించేది. ఒక యువకుడు త్రాగడం మానుకోలేకుంటే అతనిని శిరిడీలో వారముండమని సాయి ఆదేశించారు. అంతటితో అతనికి ఆ దురభ్యాసం తొలగిపోయింది. అలాగే సంభారేతో ఆయన, "ఇదే నా హెచ్చరిక: నువ్వు త్రాగుడు మానాలి, లేకుంటే నీ కర్మకు నిన్ను విడుస్తాను" అన్నారు. అంతటితో ఆ కోరిక అతడికి నశించింది. ఒకప్పుడు పై అధికారి అతనిని త్రాగమని నిర్బంధించారు. సంభారే సాయిని స్మరించగానే దీపాలు ఆరిపోయాయి. ప్రక్కనున్న మిత్రుడు అతని గ్లాసులోని మద్యం త్రాగేసాడు. మరుక్షణమే లైట్లు వెలిగాయి. సంభారే మద్యం త్రాగాడని తలచి అధికారి సంతోషించాడు.

గోవానుండి వచ్చిన ఒక భక్తుడు రూ. 35/-లు సమర్పించగా సాయి తీసికొనక నిగూఢరీతిన యిలా చెప్పారు : "నావద్ద 30 సం॥లుగా వున్న వంటవాడు దుస్సాంగత్యానికి లోనై, ఒకరాత్రి గోడకు కన్నంవేసి, రూ. 30,000/- దొంగిలించాడు. ఆ దిగులుతో నేను పిచ్చెత్తినట్లు కూర్చున్నాను. ఒక ఫకీరొచ్చి నా దిగులుకు కారణం విని, "శిరిడీలో సాయిబాబా అనే మహాత్ముడున్నాడు. నీ పైకం తిరిగివస్తే శిరిడీ వస్తానని మ్రొక్కుకుని, అంతవరకూ భోజనంలో నీకిష్టమైన వంటకం తినడం మానుకో!" అన్నాడు. అలాగే చేస్తే కొద్దికాలానికి ఆ వంటవాడు తిరిగివచ్చి పశ్చా త్తాపంతో పైకం తిరిగి యిచ్చాడు. వెంటనే శిరిడీ బయల్దేరాను. మొదట నౌకలో సరంగు ఖాళీలేదన్నాడు. ఇంతలో ఒక జవాను వచ్చి సరంగునొప్పించి నన్ను నౌక ఎక్కించాడు!" సాయి తన గత జీవితమంతా వివరించడమేగాక, ఆయనే తనకు పైకం దొరికేలా చేసిన ఫకీరని, నౌకలో తనకు స్థలమిప్పించిన జవానుగూడ వారేననీ ఆ భక్తుడు గుర్తించాడు. ఒకరోజు మధ్యాహ్నం 2 గం॥లకు బాబా, "ప్రధాన్ వచ్చాడా?" అని దీక్షిత్‌ను అడిగారు. "లేదు, కబురు చేసేదా?" అన్నాడు దీక్షిత్. "చేయి" అంటూ కొద్ది విభూతినిచ్చి, "ఇది పంపించు" అన్నారు. ఆ విభూతి, ఒక ఉత్తరమూ బాలాషింపీ ద్వారా ప్రధాన్‌కు పంపాడు దీక్షిత్. అపుడు వెల్లడైన వివరాలు: శిరిడీలో బాబా అతని గురించి హెచ్చరిస్తున్న క్షణంలో హైకోర్టులో కొందరు స్నేహితులతో మాట్లాడుతున్న ప్రధాన్, అకస్మాత్తుగా స్పృహతప్పి పడిపోయాడట. కొద్దిసేపట్లో తనంతట తానే తెప్పరిల్లుకొని, రైలులో యిల్లు చేరాడు. తెల్లవారేసరికి విభూతి, జాబులతో బాలాషింపీ బొంబాయి చేరాడు. సాయికి మన బాధలు నివేదించనక్కరలేదు. ఆయన అనుక్షణమూ మనను కనిపెట్టి వుంటారని గుర్తుంచుకొంటే చాలు.

శ్రీసాయి తమను నమ్మినవారి వెంటనుండి కాపాడుతారు. సం॥1914లో శివరాత్రి ముందురోజున, హార్దాలో మేజిస్ట్రేటుగా పనిచేసిన ఛోటూభయ్యా తన కుటుంబమందరితో శిరిడీ బయల్దేరాడు. వాళ్ళు నేమేవర్‌వద్ద నది ఒడ్డుకు చేరేసరికి చీకటిపడింది. ఎంత డబ్బిస్తామన్నా బెస్తవాళ్ళు పడవ వేయమన్నారు. దిక్కుతోచక వాళ్ళందరూ సాయిని స్మరిస్తుంటే, తలగుడ్డ, కఫ్నీగల ఒక ఫకీరు వీరివద్దకు వచ్చి, "ఆడవాళ్ళను తీసుకొని యింత పొద్దుపోయి వచ్చారేమి? పై ఆఫీసరుచేత చెప్పిస్తాను, వాళ్ళ యజమాని వచ్చైనా మిమ్మల్ని నది దాటించాలి!" అని చెప్పి, పది అడుగులు వెళ్ళి యిక కన్పించలేదు. ఇంతలో పడవవారే పరుగునవచ్చి, అందరినీ పడవ ఎక్కమని చెప్పి సామానులు పడవలో సర్దారు. బాడుగ యెంతో చెప్పమంటే, "మీ చిత్తమొచ్చినంత యివ్వండి. లేకుంటే ఏమీ యివ్వకండి" అన్నారు. ఆ కుటుంబం శిరిడీ చేరాక, జరిగినదంతా తమ లీలేనని సాయి సూచించారు. శ్రీ సాయి, నమ్మినవారిని సురక్షితంగా జీవిత సాగరం దాటించి తమ చెంతకు చేర్చుకుంటారు.

గణపతి ధోండూకదమ్ సం॥ 1914లో సకుటుంబంగా శిరిడీ వెళుతున్నపుడు వారెక్కిన రైలు పెట్టెలో మరెవ్వరూ లేరు. అతడు, "భక్తిమార్గప్రదీపిక" అనే సద్గ్రంథం పెద్దగా చదువుతున్నాడు. ఇంతలో 15 లేక 20 మంది భిల్లులు ఆ పెట్టెలోకెక్కి అతని చెంతన కూర్చున్నారు. వాళ్ళు తాను చదివేది వినడానికొచ్చారని అనుకున్నాడు గణపతి ధోండు. ఐదు ని॥ల తర్వాత, రైలు వేగంగా పోతుండగానే వాళ్ళందరూ ఆ పెట్టెలోనుండి దూకి పారిపోయారు.

ధోండ్ ఆశ్చర్యంతో తలుపు దగ్గరకు వెళ్ళి చూచాడు. ఆ భిల్లులు వెనుకకు చూస్తూ పరుగెత్తుతున్నారు. ధోండ్ గూడా వెనుకకు తిరిగి పెట్టెలో చూస్తే, ఒక పక్కగా వృద్ధ ఫకీరొకరు కూర్చున్నారు. ఆయన ఆ పెట్టెలోకెలా వచ్చారో అతడికర్థం కాలేదు. మరలా చూచేసరికి ఆయనక్కడ లేరు! అందరూ ఆశ్చర్యపోయారు. వాళ్ళు శిరిడీ చేరగానే సాయి నవ్వి, "అరె, భద్రంగానే వచ్చారే!" అన్నారు. ఆ మార్గంలో భిల్లులు తరచు రైళ్ళు దోచేవారు. అలానే ఒకప్పుడు నానాచందోర్కర్ ఒక అడవిలోనున్న ప్రసిద్ధమైన గణపతి ఆలయానికి బయల్దేరాడు. రైలు ఆలస్యమై, అతడు అడవి చేరేసరికి ప్రొద్దు గూకింది. అతడు ధైర్యంచేసి నడకసాగించి, 'బాబా! 9 గంIIకు మందిరం మూసేస్తారు. నేనక్కడకు చేరేసరికి 11 గంIIలవుతుంది. నాకప్పుడు ఒక కప్పు టీ కావాలి" అని ప్రార్థించాడు. అతడు 10 మైళ్ళు నడచి ఆలయం వద్దకు రాగానే, "ఏడీ, నానా వచ్చాడా" అని పూజారి అనడం వినిపించింది. "నేను వస్తున్నట్లు మీకెలా తెలుసు?" అని ఆశ్చర్యంగా అడిగాడు నానా. పూజారి అతనికి టీ అందిస్తూ, "నానా వస్తున్నాడు, అతడికి టీ సిద్ధం చేయండి" అని సాయి మాటలు విన్పించాయి" అన్నాడు.

ఏ పరిస్థితిలోనైనా సాయి ఆజ్ఞే శ్రీరామరక్ష. ఒకసారి నాసిక్‌లో ప్లేగు చెలరేగి ధూమల్ ఇంట్లోగూడ ఎలుకలు చచ్చిపడసాగాయి. అతడు సాయికి జాబువ్రాసి వారి అనుమతితో ఇల్లు మారాడు. ఆ ప్రాంతంలో గూడా ప్లేగు వ్యాపించి, చివరకు మంచినీటి బావిలోగూడ ఎలుకలు చచ్చిపడసాగాయి. ధూమల్ మరల బాబాకు జాబువ్రాసి, ఆయనెలాగూ యిల్లు మారమంటారని తలచి, క్రొత్త యింటికి వెళ్ళాడు. ఆ యింటి తలుపులు తెరుస్తుండగా, అతను యిల్లు మారనక్కరలేదని శిరిడీ నుండి జాబు వచ్చింది. ధూమల్ వెంటనే పాత ఇంటికి వచ్చేసి, బాబా మాటలపై పూర్తి విశ్వాసంతో అక్కడే వున్నాడు. అయినా ఎవరికీ ఏ ప్రమాదమూ జరుగలేదు.

సాయి స్మృతిమాత్ర ప్రసన్నుడు. మార్చి 6, 1913న ధూలియాలో రావూజీ బిడ్డకు జ్వరమొచ్చింది. రావూజీ బాబాను ప్రార్థించాడు. నాటిరాత్రి 2 గంటలకు అతనికి కలలో సాయి కన్పించి, బిడ్డకు విభూతి పెట్టి, "భయం లేదు, 1, 2 గంటలలో బిడ్డకు చెమటపోస్తుంది. తెల్లవారేసరికి తగ్గుతుంది. తర్వాత దర్శనానికి తీసుకురా!" అన్నారు. అలానే జరిగింది. మూడవరోజు శిరిడీ నుండి రావూజీకి జాబొచ్చింది; "నేను ధూలియాలో నీ మిత్రుడు రావూజీ యింటికి వెళ్ళాను" అని శ్యామాతో బాబా అన్నారట. రెండువారాల తర్వాత ఆ కుటుంబం శిరిడీ బయలుదేరారు. ఆరోజు ఆరతి సమయంలో సాయి, "శ్యామా! ఆరతి కొంచెమాగి ప్రారంభించు. ఆ టాంగావాడు జాగుచేస్తున్నాడు" అన్నారు. అతడలాగే చేశాడు. ప్రసాదం పంచేవేళకు రావూజీ అక్కడకు చేరాడు. అతడి బిడ్డతో సాయి, "నీకు జబ్బు చేసినప్పుడు ధూలియా వచ్చాను గుర్తుందా?" అన్నారు.

ఒక వేసవి శలవులలో నానాచందోర్కర్ తన స్నేహితులతో కలసి హరిశ్చంద్ర గుట్ట వెళ్ళాడు. మధ్యలో అతడు ఎండకు డస్సిపోయి, "నీరు త్రాగక నేనొక్క అడుగైనా వేయలేను. సాయియే నన్ను కాపాడాలి" అని ఒక బండమీద కూలబడ్డాడు. మరుక్షణమే ఒక భిల్లుడు కట్టెలు మోసుకొస్తూ, నానాతో, "మీరు కూర్చున్న బండక్రింద మంచినీరుంది, త్రాగండి" అన్నాడు. చూడగా బండ క్రింద స్వచ్ఛమైన నీరున్నది! అతడు దప్పిక తీర్చుకున్నాడు. సరిగా అదే సమయంలో శిరిడీలో సాయి, "నానా దప్పికతో చావనున్నాడు. కాని నేను చావనివ్వను" అన్నారని తెలిసింది!

అన్నాసాహెబ్‌బాబరే శిరిడీ వెళ్ళినపుడు అతని గ్రామంలో ప్లేగు చెలరేగింది. అందరూ ఊరు విడిచి వెళ్ళిపోయారు. అతని భార్య, బిడ్డ మాత్రమే అక్కడ వుండిపోయారు. ఆ వ్యాధి అంతరించి, గ్రామస్థులు తిరిగి వచ్చేదాకా సాయి ఆమెకు 10, 12 సార్లు సాక్షాత్కరించి అభయమిచ్చారు!

ఒకరోజు రామగిరిబువా అనే గోసాయి యింటికి వెళ్ళడానికి బాబాను శలవుకోరాడు. సాయి అతనిని 'బాపూగిర్' అని సంబోధించేవారు. ఆయన, "నీవు మొదట జామ్నేర్ వెళ్ళి, నేనిచ్చే ఊధీ, ఆరతిపాట, నానాచందర్కోర్‌కు యిచ్చి, మీ ఊరువెళ్ళు!" అన్నారు. "నేను సిద్ధమే! కాని నావద్ద డబ్బు జల్గాం వరకే సరిపోతుంది. ఆపైన జామ్నేర్‌కు బండిలో సుమారు 30 మైళ్ళు వెళ్ళాలి గదా" అన్నాడు రామగిర్. "అన్ని ఏర్పాట్లు జరుగుతాయి వెళ్ళు!" అన్నారు సాయి. అర్థరాత్రి 2 గం॥లకు అతడు జల్గాం చేరాడు. అతనివద్ద రెండు అణాలు మాత్రం మిగిలాయి. అతడికి దిక్కుతోచలేదు. ఇంతలో ఒక బిళ్ళబంట్రోతు అతనివద్ద కొచ్చి, "శిరిడీ నుండి వచ్చిన బాపూగిర్ యెవరు?" అని విచారించి, అతనికోసం చందోర్కర్ టాంగా పంపాడని చెప్పి తీసుకెళ్ళాడు. టాంగా జామ్నేర్ పొలిమేర చేరాక, రామ్‌గిర్ లఘుశంకకు వెళ్ళివచ్చేసరికి, ఆ టాంగా యెక్కడా కన్పించలేదు. ఆ సమయంలో నానాసాహెబ్ కుమార్తె మైనతాయి ప్రసవవేదన పడుతోంది. సరిగా సమయానికి రామ్‌గిర్‌వచ్చి, ఆరతిపాట, ఊధీ యిచ్చాడు. నానా సంతోషంతో మైనతాయికి ఊధీ యిచ్చి, సాయికి ఆరతి యివ్వగానే ఆమెకు ప్రసవమైంది. తమకు సకాలంలో ప్రసాదమందించినందుకు నానా కృతజ్ఞత చెబితే, తనకోసం టాంగా పంపినందుకు రామ్‌గిర్ కృతజ్ఞత చెప్పాడు! నిజానికి టాంగా, బంట్రోతులను నానా పంపలేదు; శిరిడీనుండి ఒకరు వస్తున్నట్లుగూడ అతనికి తెలియదు! ఆ సంగతి విన్న రామ్‌గిర్‌కు, స్టేషన్‌లో బంట్రోతు తనను సాయిలాగానే పిలిచాడని, సాయి అన్ని యేర్పాట్లూ జరుగుతాయని చెప్పినదీ గుర్తొచ్చింది. అదంతా సాయి లీలేనని వారు తెలుసుకున్నారు.

ఒకరోజు నాగపూర్‌లో దీక్షిత్ తమ్ముడు జబ్బుపడినట్లు జాబొచ్చింది. దీక్షిత్, "బాబా! నా తమ్ముడికి నేనే సాయమూ చేయలేకున్నాను" అన్నాడు. వెంటనే బాబా, "సహాయం నేను చేస్తాను" అన్నారు. అదే సమయానికి నాగపూర్‌లో అతని సోదరునికి చిత్రమైన వ్యక్తి కనబడి తక్షణమే స్వస్థుణ్ణి చేశాడు! ఒకసారి సెలవు తీసుకుంటున్న ఒక భక్తునికి సాయి మరొక ఊధీ పొట్లమిచ్చి, "రైల్లో నిన్ను జానెడు స్థలమిమ్మని కోరినవాడికి ఆ పొట్లమివ్వు!" అన్నారు. దారిలో ఠాణే స్టేషన్లో రైలు బయలుదేరగానే ఒక ప్రయాణీకుడు పరుగున రైలెక్కి అతనివద్దకొచ్చి, "నాకు తల తిరుగుతోంది, కూర్చోడానికి జానెడు స్థలమివ్వండి" అన్నాడు. భక్తుడు అతనికి చోటిచ్చి, ఊధీగూడ యిచ్చాడు. ఆ వ్యక్తి ఆనందభాష్పాలు కారుస్తూ, తానెంత యత్నించినా శిరిడీ దర్శించలేక పోయానని, సాయియే తనకు ప్రసాదం పంపాలని ప్రార్థించాననీ చెప్పాడు.

రోగమేగాక అజ్ఞానమనే రోగంగూడ తొలగాలి. అందుకు బాధలను ధైర్యంగా ఓర్చుకోగలగడం అవసరం. అందుకే వ్యాధి మరీ ప్రమాదకరం కానప్పుడు రోగిని తనవద్దనుండి వెళ్ళిపొమ్మనేవారు బాబా. పరోక్షంగాగూడ ఆయన రక్షిస్తారని భక్తునికి తెలియాలిగదా! శిరిడీలోని కాకాదీక్షిత్‌కు తీవ్రంగా జ్వరమొచ్చి, శ్యామా ద్వారా బాబాకు కబురుచేశాడు. ఆయన "నేనేమీ వైద్యుణ్ణి కాదు. అతడిని యింటికి పొమ్మను!" అన్నారు. శ్యామా నివ్వెరబోయి, "అతడు మిమ్మల్నే నమ్ముకున్నాడు. జ్వరంతో ఎలా వెళ్ళగలడు?" అన్నాడు. సాయి తిరిగి కఠినంగా అలానే ఆదేశించారు. సెలవు తీసుకోడానికి కాకా మశీదుకు రాగానే సాయి, "నీవింటికి పో! ఎలా వచ్చిన జ్వరం అలానే నాల్గురోజుల్లో పోతుంది. సీమబాదము, పిస్తావేసిన పాయసం తిని తిరుగు. పడుకోకు!" అన్నారు. అతనికి ఊధీ యిచ్చి శ్యామాను తోడు పంపారు. వాళ్ళు రాత్రి 11 గం॥కు రైలుదిగి నడిచి యింటికి వెళ్ళారు. అక్కడ యెవరు చెప్పినా వినకుండా కాకా సాయి చెప్పినట్లే చేసాడు. వైద్యుడు, "నీవు ఆ పిచ్చి ఫకీరు చెప్పినట్లు చేసేటట్లైతే నేనెందుకు?" అని గద్దించాడు. అయినా కాకా వినలేదు. 9వరోజుకు జ్వరం తగ్గింది. తర్వాత అతడు శిరిడీ వెళ్ళినపుడు బాబా, "బొంబాయిలో మీవాళ్ళేమన్నారు" అని అన్నారు.

శ్రీ నృసింహ సరస్వతిలాగా బాబాగూడ యిలా అపథ్యమైన ఆహారంతో జబ్బులు తగ్గించేవారు. ఒకసారి

బూటీకి కలరావచ్చి, డాక్టర్ పిళ్ళే యెన్ని మందులిచ్చినా తగ్గలేదు. చివరకు బాబాను అడిగితే బాదము, పిస్తా వేసిన పాయసం తినమన్నారు. అలా చేయగానే జబ్బు తగ్గిపోయింది! ఒకరోజు కాకా మహాజనికి విరేచనాలు అవుతుంటే మశీదులో ప్రక్కనే కుండతో నీరుంచుకొని తరచుగా బయటకు వెళ్ళివస్తున్నాడు. బాబా సర్వజ్ఞులుగదా! అని ఆయనతో చెప్పలేదు. భక్తులు మశీదు ముంగిట పనిచేస్తున్నారు. సాయి అకస్మాత్తుగా కోపించి అందర్నీ తిట్టసాగారు. భయంతో అందరూ పారిపోయారు. కాకాను మాత్రం సాయి బలవంతాన కూర్చోబెట్టి అక్కడెవరో విడిచిన వేరుశెనగపప్పు అతనిచేత తినిపించి, ఆ కుండలో నీరు తాము కొంచెం త్రాగి అతడిచేత త్రాగించి, "నీ జబ్బు తగ్గిపోయింది!" అన్నారు. అతడికి ఆ క్షణంలోనే ఆ వ్యాధి తగ్గిపోయింది. ఈ చికిత్సలలోని రహస్యం ఆయన సంకల్పమే. ఒకసారి శ్యామా మొలలతో బాధపడుతుంటే ఆయన సోనాముఖి కషాయంచేసి, కొంచెం అతనికిచ్చి, కొంచెం ఆయన త్రాగారు. ఆ రోజుతో ఆ బాధ తగ్గిపోయింది. మూడు సం॥ల తర్వాత శ్యామాకు ఆ వ్యాధి మరలా వచ్చింది. వెనుక బాబా చేసిన వైద్యమే అతడు చేసుకుంటే వ్యాధి తీవ్రమై, మరల సాయి అనుగ్రహంతోనే, ఊధీతోనే తగ్గింది.

రఘువీర్ పురందరే మొదటిసారి శిరిడీకి బయల్దేరినప్పుడు అతని బిడ్డకు బాగా జ్వరమొచ్చింది. అతని భార్యకు తోడుగా అతని తల్లి వుంటానన్నది. కాని అతడు పట్టుపట్టి ఆమెనుగూడ తనతో తీసుకెళ్ళాడు. వాళ్ళు శిరిడీచేరిన మూడవ రోజున పురందరే భార్యకు బాబా కలలో కనిపించి, బిడ్డకు ఊధీ యిచ్చారు. ఆ క్షణంనుండి జ్వరం తగ్గిపోయింది.

సాయి మనం కోరినదల్లా నెరవేర్చక, పూర్వకర్మ దృష్ట్యా మనకు శ్రేయస్కరమైనదే చేస్తారు. ఒకామె తన బిడ్డను పాము కరచిందని ఆయనతో మొరపెట్టుకున్నది. ఆయన ఊధీ యివ్వలేదు, ఆశీర్వదించలేదు. ఆ పిల్లవాడు చనిపోయాడు. ఆ తల్లి శోకం చూడలేక, బిడ్డను బ్రతికించమని దీక్షిత్ కోరాడు. సాయి, "బావూ, యీ విషయంలో కల్పించుకోకు. ఇది అతడి మంచికే జరిగింది. అతడీ శరీరంతో చేయలేని పనులు ఆ శరీరంతో చేయగలడు. అతనిని బ్రతికిస్తే ఆ దేహం మరణిస్తుంది. అందుకు బాధ్యత నీవు వహిస్తావా?" అన్నారు. దీక్షిత్ తన తప్పు తెలుసుకున్నాడు. అలానే 1911లో హార్దానుండి వచ్చిన ఒక క్షయరోగి మరణించాడు. అతనిని రక్షించలేదని అతని బంధువులు బాబాపై అలిగారు. తర్వాత వారిలో ఒకరికి బాబా కలలో కనిపించి, రోగి తలను తమ తలపై నుంచుకొని కుళ్ళిన అతని ఊపిరితిత్తులు చూపుతూ "అతనిని యింతటి చిత్రహింస నుండి నేను విడుదల చేసాను" అని చెప్పారు. అతని బంధువర్గమంతా తిరిగి సాయిని సేవించసాగారు.

బాబా తామెప్పుడైనా భక్తులు కోరినది ప్రసాదించదల్చకపోతే ఏమీ మాట్లాడేవారు కారు. సాయి తనకొక మగబిడ్డను ప్రసాదించాలన్న కోరికతో గోవిందరావు శిరిడీ వస్తుండేవాడు. కాని బాబా యేమీ చెప్పేవారుగాదు. మరో వివాహం చేసుకుంటే బిడ్డలు కల్గుతారేమోనని చెప్పమంటే గూడ ఆయన మాట్లాడలేదు. అతడికి సంతానం కల్గనేలేదు.

★★★